## క్లుప్తంగా

### ఎస్‌ఐ పోస్టుకు సన్యాసినాయుడు ఎంపిక



సబ్బవరం: మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెనగంటి సన్యాసినాయుడు ఎస్‌ఐగా ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం విడుదలైన ఫలితాల్లో ఏలూరు జోన్-2 సివిల్ ఎస్‌ఐగా ఎంపికైనట్లు ప్రకటించారు. ఆయన స్వగ్రామం విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని నల్లబెల్లి గ్రామం కాగా.. విద్యాభ్యాసం మండలంలోని సూరెడ్డిపాలెంలోని తన సోదరుడు భాస్కరరావు ఇంటివద్ద సాగింది. టెన్త్ వరకు బొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో, ఇంటర్ చినముషిడివాడ ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో చదివారు. అనంతరం ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేసి, ఎస్‌ఐ పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం గ్రూప్-2కు సిద్ధమవుతున్నట్లు సన్యాసినాయుడు తెలిపారు.

### పంటకోత ప్రయోగాలే దిగుబడికి ప్రామాణికం



పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న ప్రణాళిక, వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: పంటకోత ప్రయోగాలే పంట దిగుబడికి, పంటల బీమాకు ప్రామాణికమని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గేదెల రామారావు తెలిపారు. మండలంలోని భాటజంగాలపాలెంలో గురువారం నిర్వహించిన వరి పంటకోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5/5 ప్లాట్‌లో కేవలం 5.750 కిలోల దిగుబడి మాత్రమే వచ్చినట్లు ఆయన చెప్పారు. పంట ఎండిపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంటకోత ప్రయోగంలో ఉప గణాంక అధికారులు రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏఎస్‌వో రమాదేవి, వీఏఏ హరీష్, అప్పారావు, గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



గంగరాజు

పెందుర్తి: పెందుర్తికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెందుర్తిలో నివాసం ఉంటున్న లోచర్ల గంగరాజుకు మతి స్థిమితం ఉండదు. గత నెల 10న ఇంటి నుంచి బయటికి వెళ్లిన గంగరాజు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. ఫలితం లేకపోవడంతో గురువారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్‌సీ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం



దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు తీవ్రనష్టం వాటిల్లుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఐక్య పోరాటాలతో దీనిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1043వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడితే.. మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలు దండుకుని ప్రజలను అణచివేస్తారన్నారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు



# సంక్షేమ ప్రదాత సీఎం జగన్

'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ నాడు ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చిన ఈ నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్లి ప్రభంజనంలా మారింది. అందరి ఆశీస్సులు, అంతులేని అభిమానం, అత్యధిక మెజార్టీతో ముఖ్యమంత్రిగా ఆయన అధికారం చేపట్టాక ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నాలుగున్నరేళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారు. తన విప్లవాత్మక, చరిత్రాత్మక నిర్ణయాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తిగా.. ఆయన జన్మదినోత్సవం సందర్భంగా గురువారం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఘనంగా జగనన్న జన్మదిన వేడుకలు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు



వేపగుంటలో కేక్ కట్‌చేసి కార్పొరేటర్ దేముడుకు తినిపిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



అడవివరంలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న ఎర్ర వరహా నరసింహం



పరవాడ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెందుర్తి: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నియోజకవర్గంలో గురువారం జగనన్న పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే సారథ్యంలో వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేపగుంటలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా భారీ కేక్ కట్‌చేశారు. పేదలకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ జన్మదినోత్సవం రోజున పెద్ద ఎత్తున వస్త్రదానం చేయడం ఆనందదాయకమన్నారు. పేదలకు నవరత్నాలు ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం తన పెద్ద మనసు చాటుకుంటున్నారన్నారు. జనవరి 1 నుంచి దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా సామాజిక పింఛన్లను రూ.3 వేలు చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో రూ.25 లక్షల వరకు వైద్యం అందేలా సీఎం వైఎస్ జగన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయననే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వారియర్స్‌కు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బట్టు సూర్యకుమారి, ఎంపీపీ మధుపాడ నాగమణి, పార్టీ నాయకులు ఆదిరెడ్డి మురళీ, టి.నర్సింగ్, గొర్లె రామునాయుడు, గొరపల్లి శ్రీను, యతిరాజుల నాగేశ్వరరావు, బల్ల రాంబాబు, కోడిగుడ్ల దేవిసాంబ, మధుపాడ అంజి, గొల్లవిల్లి రమణ, చందుయాదవ్, దాసరి సత్తిబాబు, టి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**అనాథ పిల్లలకు అన్నదానం**

సుజాతనగర్‌లోని ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో అనాథ పిల్లల మధ్య 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కేక్ కట్‌చేసి వారికి తినిపించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ కొనసాగడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

**పురుషోత్తపురంలో..**

సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు కోరాడ చందుయాదవ్ ఆధ్వర్యంలో పురుషోత్తపురంలో కేక్ కట్‌చేశారు. నాయకులు యలమంచలి శ్రీను, ఆబోతు వెంకటరమణ, సింహాద్రి సూరిబాబు, పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

**రోగులు, విద్యార్థులకు వితరణ**

పరవాడ: స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, వసతి గృహం విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

వాడచీపురుపల్లి పంచాయతీ కార్యాలయంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వాడచీపురుపల్లి సచివాలయ కన్వీనర్ కూండ్రపు ఉమా కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి తినిపించారు.

**పేదలకు దుప్పట్ల పంపిణీ**

సింహాచలం: అడవివరంలో వైఎస్సార్‌సీపీ 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు అందజేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వరదా నరసింహమూర్తి, నడింపల్లి రామరాజు, లంక సత్తిబాబు, దాసరి కనకరాజు, తొమురోతు రాము, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

**విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు**

వైఎస్సార్‌సీపీ 93వ వార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో 489 సచివాలయం పరిధిలోని కృష్ణానగర్‌లో కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు పంచిపెట్టారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పార్టీ వార్డు నాయకులు దాసరి సత్తిబాబు, వినోద్, బండి సత్తిబాబు, వర్మ, తామర్ల నర్సింగ్, శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ 94వ వార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి పాల్గొన్నారు.

**సబ్బవరంలో..**

సబ్బవరం: సబ్బవరం మండలంలోని వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కోటాన రాము, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ, నాయకులు బోను గంగునాయుడు, గవర రాజు, పిల్లల అప్పలనాయుడు, వేపాడ సోమునాయుడు, జెట్టి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్ అనాథాశ్రమంలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



93వ వార్డులో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న దాసరి అన్నపూర్ణ

# విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



సబ్బవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, కోటాన రాము చేతుల మీదుగా బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, ప్రధానోపాధ్యాయులు ఎస్. తిరుపతిరావు, మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు, పార్టీ సీనియర్ నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి, బోను గంగునాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# విశేషంగా ధనుర్మాస పూజలు



అప్పన్న ఉత్సవమూర్తులకు బేడా తిరువీధిలో ఫలాలను సమర్పిస్తున్న అర్చకుడు



గోదాదేవికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజలను ఐదో రోజు గురువారం విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం, సాత్తుమొరై, గోదాదేవికి బేడా మండపంలో తిరువీధి వేడుకను వైభవంగా నిర్వహించారు.

**ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు..**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు తొమ్మిదో రోజు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. దివ్యప్రబంధ పారాయణాలు పటించారు. శుక్రవారంతో పగల్‌పత్తు ఉత్సవాలు ముగియనున్నాయి.

**వెంకన్న ఆలయంలో..**

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాసం పూజలు విశేషంగా జరిగాయి. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై వేంజేపచేశారు. పాశుర విన్నపా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

# అమ్మ సన్నిధి.. భక్తజన పెన్నిధి



స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. విశాఖ వాసుల ఆరాధ్యదైవం సిరులతల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. పసుపు, కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి, పసుపు పూశారు. అనంతరం అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి బుధవారం అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, మళ్ల ధనలత, బెహర వెంకటరత్నం, బుద్దల అనురాధ, ఎస్.సతీష్, వంకాయల మారుతీప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, గురమ్మ, ఎస్.సురేష్, కొడమంచలి శ్రీనివాసశర్మ, ప్రత్యేక ఆహ్వానితులు ఏవీ రామకృష్ణారావు, గండెం ప్రకాష్, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ తదితరులు అమ్మవారి సేవలో పునీతులయ్యారు. గురువారం రాత్రి వరకు 40 వేల పైబడి భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

**కనకమహాలక్ష్మికి పట్టు వస్త్రాల సమర్పణ**

మార్గశిర మాసోత్సవాలు పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేసింది. ఆలయ సంప్రదాయం ప్రకారం టీటీడీ ప్రతినిధులకు స్వాగతం పలికి.. వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు.

### ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకోండి



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. జ్ఞానాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆరోగ్యశ్రీ నూతన హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డులను ప్రతి ఆస్పత్రి తప్పనిసరిగా స్వీకరించి రోగులకు వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారుల కంటి సమస్యలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సమత

మహారాణిపేట: డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం తక్కువ బరువు, నెలలు నిండకుండా పుట్టిన చిన్నారుల్లో ఏర్పడే కంటి సమస్యలపై వైద్యులు, వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఐపీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సమత మాట్లాడుతూ ఆర్‌వోపీ అంటే ఏంటి, ఎటువంటి పిల్లలకు ఈ సమస్య వస్తుంది, ఎప్పుడు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలో అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సూచన ప్రకారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షిత, కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ రాజు, పిల్లల వైద్యుడు డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న సన్నిధిలో తిరుప్పావై సేవ



పూజలందుకుంటున్న గోదాదేవి



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం తిరుప్పావై సేవా కాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై ఐదో పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

# అనైతిక వ్యాపారాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎంఈవో సాయి శైలజ

పరవాడ: అనైతిక వ్యాపారాలు, తప్పుదోవ పట్టించే ప్రకటనలను అరికట్టడానికి వినియోగదారుల రక్షణ చట్టం అండగా నిలుస్తుందని మండల విద్యాశాఖ అధికారి జి.సాయిశైలజ అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకుని కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఈ కామర్స్ డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మోసపూరిత ప్రకటనల్లో కనిపించే సెలబ్రిటీలపై మరే ప్రకటనల్లోనూ కనబడకుండా వినియోగదారుల చట్టం ప్రకారం ప్రభుత్వం 3 ఏళ్లు నిషేధం విధిస్తుందన్నారు. వినియోగదారుల చట్టం-2019 పరిధిలోకి ఈ-కామర్స్ వినియోగదారులు వస్తారని తెలిపారు. కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకట రమణ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు, హాల్‌మార్క్ బంగారు ఆభరణాల స్వచ్ఛత, తూనికల్లో తేడాలు, కొలతల్లో మోసాల గురించి వివరించారు. సొసైటి అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో అన్ని విద్యా సంస్థల్లో వినియోగదారుల హక్కులపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులో నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం విక్టోరియారాణి, సొసైటీ ప్రతినిధులు సామోజు శ్రీను, సూరాడ రాజేంద్ర, వాసుపల్లి పుష్యమిత్ర, కస్నూరి హరి పాల్గొన్నారు.

# జగనన్న సారథ్యంలో అభివృద్ధి పథాన రాష్ట్రం



93వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అన్నపూర్ణ, నాయకులు

సింహాచలం: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథాన పయనిస్తోందని వైఎస్సార్‌సీపీ 93వ వార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ తెలిపారు. వార్డు పరిధి కృష్ణానగర్‌లోని 498 సచివాలయం పరిధిలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్ద పీట వేశారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. ఇచ్చిన మాట తప్పని నాయకుడిగా జగన్ నిలుస్తారని కొనియాడారు. కార్యక్రమంలో 93వ వార్డు నాయకులు దాసరి సత్తిబాబు, వినోద్, నిర్మల, తాతబాబు, పార్వతి, 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పార్టీ నాయకుడు వర్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# నూర్పిడి యంత్రంలో చిక్కుకొని మహిళ మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

పరవాడ: నూర్పిడి యంత్రంలో ఓ మహిళ చిక్కుకొని ప్రాణాలు కోల్పోయింది. రావాడలో గురువారం ఈ ఘటన చోటుచేసుకోగా.. అదే గ్రామానికి చెందిన గంగిరెడ్ల నూకరత్నం(52) మృతి చెందింది. వివరాలివీ.. గ్రామానికి చెందిన రైతు దాసరి రమణకు చెందిన వరి చేనును గురువారం వారి కళ్లంలో నూర్చడానికి నూర్పిడి యంత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ యంత్రం వద్ద నూకరత్నం పనిచేస్తోంది. నూర్పిడి యంత్రం నుంచి వచ్చిన గడ్డి, గింజలు వంటివి వేరు చేస్తున్న నూకరత్నం చీర నూర్పిడి యంత్రం చక్రంలో చిక్కుకుంది. ఈ క్రమంలో పీక బిగుసుకుపోయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మృతురాలికి ఇద్దరు సంతానం. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మల్లేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.